క్లుప్తంగా

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



భట్టిప్రోలు: ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ నెలలో కఠోర ఉపవాసాలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా ఆదివారం భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పల్లెకోన, వేమవరం గ్రామాలలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నమాజులు, ఉపవాసాలు, పుణ్యకార్యాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

పెదపులివర్రులో ముగిసిన బ్రహ్మోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ, నీళా సమేత వరదరాజస్వామి దేవాలయంలో పంచాహ్నికంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి రాత్రి ద్వాదశ ప్రదక్షిణములు, పుష్ప యాగోత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలను కొసరాజు వెంకట సతీష్‌బాబు, పద్మజ దంపతులు నిర్వహించారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి ఇ.సాంబశివరావు పర్యవేక్షించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చెరుకుపల్లి: కోడి పందేల స్థావరంపై స్థానిక పోలీసులు మెరుపు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ టి.అనీల్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ సిబ్బందితో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు జాబ్ మేళా

చెరుకుపల్లి: ఈ నెల 18వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించటం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, చెరుకుపల్లి ఎంపీడీఓ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో డాక్టస్ బిజినెస్ సొల్యూషన్స్, డైకిన్ ఎయిర్ కండిషన్స్ పాల్గొంటాయని, 100కు పైగా ఖాళీలు ఉన్నాయని, విద్యార్హతను బట్టి జీతం ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు చదువుకున్న 18–30 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9032384374 నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

తెనాలిటౌన్: మారీసుపేటలోని 22వ వార్డులో ఆదివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. దివంగత మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు మాట్లాడుతూ.. ఫాతిమా పేరిట 10 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో షేక్ సుభాని, రావి చిన్ని, ఈదర పూర్ణచంద్, శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, కన్నెగంటి మురళీ, వుయ్యూరు రాజశేఖర్‌రెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో పరిశుభ్రతా పనులు



తెనాలి టౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో చినరావూరులోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాన్ని ఆదివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు పట్టణంలోని 122 దేవస్థానాలను శుభ్రం చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో హరిప్రసాద్, ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, యోగ మండలి సభ్యులు అక్షర, లత, రాణి, తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, నాగరాజు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

పుచ్చ రైతు పచ్చగా

- ఊపందుకుంటున్న పుచ్చకాయల వ్యాపారం
- నియోజకవర్గంలో వందలాది మందికి ఉపాధి
- సీజన్‌లో రూ.లక్షల్లో వ్యాపారం
- బాపట్లలో 200 ఎకరాల్లో పంట సాగు



పాండురంగాపురంలో పుచ్చ సాగు

బాపట్లటౌన్: భగభగ మండుతున్న భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందే మార్గల్లో పచ్చకాయ ఒకటి. మండు వేసవిలో పుచ్చకాయ తింటే ఆ మజానే వేరు. నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ తిన్న వెంటనే శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధీకరిస్తుంది. ప్రస్తుతం బాపట్ల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి.

మండలంలో సాగు ఇలా...

పుచ్చకాయ సాగు కోసం ఎకరాకు అరకేజి విత్తనాలు భూమిలో నాటాలి. విత్తన ధర కిలో రూ.4 వేల నుంచి 6 వేలు ఉంటుంది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు సాగు చేసుకోవచ్చు. భూమిలో విత్తినప్పటి నుంచి 90 రోజుల్లో కాపు వస్తుంది. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను పుచ్చకాయలు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతుంది. ప్రతి వారం నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. ఎకరాలో పుచ్చకాయ సాగు చేసేందుకు సుమారు రూ.35 వేల నుంచి రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. తేలికపాటి నేలలు, ఇసుక నేలల్లో ఈ పంటను సాగుచేసుకోవచ్చు. వేసవిలో పుచ్చ సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. మొదట్లో నియోజకవర్గంలో నాలుగైదు ఎకరాల్లో మాత్రమే పండించేవారు. ప్రస్తుతం ఒక్క బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, పిన్నిబోయినవారిపాలెం, వల్లువారిపాలెం, ఓడరేవు, హైదరపేట గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.



పుచ్చకాయలను విక్రయిస్తున్న వ్యాపారి



తోటలో విక్రయానికి సిద్ధం చేసిన పుచ్చకాయలు

పెరిగిన వ్యాపారం

భగభగ మండుతున్న భానుడి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని చిన్న చిన్న వ్యాపారులు తోపుడుబండ్లపై కేవలం పుచ్చకాయలు విక్రయించడమే ప్రధాన వ్యాపారంగా పెట్టుకున్నారు. గడిచిన పది రోజుల వ్యవధిలో బాపట్ల పట్టణంలో సుమారు 150 మందికిపైగా పుచ్చకాయల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. ఇదే రీతిలో బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం, బాపట్ల మండలాల్లో సుమారు 200పైగా పుచ్చకాయ దుకాణాలు వెలిసాయి. కొనుగోళ్ల శాతం కూడా పెరిగింది. రోజుకు సగటున రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. ఈ సీజనల్ ముగిసేలోపు రూ.లక్షల్లో వ్యాపారాలు జరుగుతాయని వ్యాపారులు అంటున్నారు.

వితలేశ్వర్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం బృందానికి విన్నవించిన ప్రజలు



వితలేశ్వర్ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం బృందం సభ్యులు

భట్టిప్రోలు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ఆదివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ, వితలేశ్వర్ నగర్‌లలో నిర్వహించడం జరిగింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీపీఎం నాయకుల బృందానికి తెలియజేశారు. మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో అర్హులైన వృద్ధులు, వితంతువులు పింఛన్లు అందక, ఉపాధి హామీ కార్డులు లేక పనులకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. 20 దశాబ్దాల క్రితం ఇళ్ల స్థలాలు ఇచ్చిన వితలేశ్వర్ నగర్‌లో అంతర్గత రోడ్లు, మురుగు నీరు పారుదల లేక వర్షాకాలం నీళ్లు ఇంటి ముందు నిలబడడం వల్ల ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాగే తాగునీటి కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఒక వార్డుగా వితలేశ్వర్‌నగర్‌ను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారుల దృష్టి సారిస్తూ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ముక్త కంఠంతో కోరారు. పరిష్కారం కోసం కృషి చేస్తామని గ్రామవాసులు తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మురుగుడు సత్యన్నారాయణ జి.నాగరాజు, పి.అహరోను, పి.మనోజ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొన్న చాయమ్మ

తెనాలి: ప్రజల కోసం పనిచేసే ఉద్యమ పోరాటాల్లో చాయమ్మలోని సద్గుణాలను స్ఫూర్తిగా తీసుకోవాలని రైతు కూలి సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ (ఎంఎల్) పార్టీ సభ్యురాలు చాయమ్మ సంస్మరణ సభను ఆమె స్వస్థలమైన తెనాలిలో ఆదివారం నిర్వహించారు. ఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగిన ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు నేతలు హాజరయ్యారు. అధ్యక్షత వహించిన సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. చాయమ్మ జీవిత విశేషాలను తెలియజేశారు. ఆమె తండ్రి సూర్యనారాయణ ఒడిశాలోలోని జయపూర్‌కు చెందినవారనీ, అక్కడ గల రెండు ప్రింటింగ్ ప్రెస్సుల్లో 30 మంది వరకు గల వర్కర్లతో యూనియన్‌ను స్థాపించారని చెప్పారు. ఎంతగా పోరాడినా యాజమాన్యం స్పందించకపోవటంతో ఒడిశా ఆర్టీసీ యూనియన్ సహకారంతో అక్కడే సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ పెట్టి, వర్కర్లను అన్నిరకాలుగా ఆదుకున్నట్టు చెప్పారు. సూర్యనారాయణ మరణంతో ఆయన పెద్ద కుమార్తె చాయమ్మ బాధ్యతను పార్టీ తీసుకున్నారని తెలిపారు. పార్టీ ప్రతిపాదించిన బొల్లిముంత సాంబశివరావును వివాహం చేసుకున్నట్టు తెలిపారు. అప్పట్నుంచి పార్టీ అప్పగించిన ప్రతిపనినీ నిర్వర్తించినట్టు వివరించారు. రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు భార్గవశ్రీ ప్రసంగించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు మండవ శోభారాణి నిర్వహణలో జరిగిన ఈ సభలో జనసాహితీ నేత దివికుమార్, ప్రజాసాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, సీపీఐ తెనాలి కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీపీఎం నేతలు కొల్లిపర బాబూప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, 'ఇస్కఫ్' బొల్లిముంత కృష్ణ, నాస్తిక సమాజం నేత నండూరి నారాయణ, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, సీపీఐ (ఎంఎల్) నాయకులు కిషోర్‌బాబు, చాయమ్మ కుమార్తెలు మహిత, అనూష మాట్లాడారు. తొలుత చాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



అడవులదీవిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



నిజాంపట్నంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



వెల్లటూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ నిర్వాహకులు

నిజాంపట్నం: మహనీయుల సేవలను గుర్తు చేసుకోవటం ప్రతి పౌరుని బాధ్యతని అడవుల దీవి గ్రామ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని అడవులదీవి గ్రామంలో ఆదివారం నిర్వహించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్యాగాలకు, సేవా తత్పర గుణాలకు ప్రతీకలు ఆర్యవైశ్యులన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని త్యాగం చేసి అమరజీవిగా నిలిచారన్నారు. ఆయన సేవలను రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ కోటేశ్వరరావు, సభ్యులు అద్దేపల్లి లక్ష్మీ నరసింహారావు, వంకాయల గిరి, ఆలపాటి సాయిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నంలో...

పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని మండల కేంద్రమైన నిజాంపట్నం మెయిన్ బజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య నాయకులు నిర్వహించారు. శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిజాంపట్నం ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొల్లిపర రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఆలపాటి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ నాళం సురేష్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం చైర్మన్ కే గౌరీశంకర్ పాల్గొన్నారు.

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు

వెల్లటూరు(భట్టిప్రోలు): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను అర్పించి అమరజీవి అయిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు ఆంధ్రులకు చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో భాగంగా వేసవి కాలం సమీపిస్తుండటంతో క్లబ్ ఆధ్వర్యంలో మంచినీటి కుండలను పంపిణీ చేశారు. నిర్వాహకులు, అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు వాసవి, వనిత క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని భట్టిప్రోలు రథం సెంటర్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాల య ఆవరణ, టీఎంరావు హైస్కూల్‌లలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వాకా శివరామ ప్రసాద్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్ర సాధనకై ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయనను స్మరించుకోవటం ప్రతి తెలుగువాని బాధ్యతని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బేతపూడి వెంకటేశ్వరరావు, పిన్ని సాంబశివరావు, అన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ రాంబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని మాజీ ఎంపీపీ, ఆర్య వైశ్య నాయకుడు బొల్లిశెట్టి ప్రభాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో ఆదివారం పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయుడన్నారు. అలాంటి వ్యక్తిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు కల్వా మధుసూదనరావు, సాధు శ్రీనివాసరావు, కొలిపాకుల శివశంకర వరప్రసాద్, నంబూరు గాంధీ, కల్వా మణి, బి.మస్తానరావు, దుంప గణేష్, నంబూరు రాజేష్, మాలపాటి వేణుమాధవ తదితరులు పాల్గొన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య నాయకుడు కాకరపర్తి నాగేశ్వరరావు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి సెంటరులో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కంభం గిరి, కట్టుపల్లి సాయిరామ్, జ్యోతుల సాయి, తలకాయల ప్రకాష్, కె.చినబాబు తదితరులు పాల్గొన్నారు.



అమర్తలూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బస్టాండ్ సెంటరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన ఆర్య వైశ్యులు



రేపల్లెలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



తహసీల్దార్ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



నిజాంపట్నం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతిరావు చెప్పారు. మండలంలోని గుణంతిప్ప గ్రామానికి చెందిన వీరంకి వెంకటేశ్వర్లు గత నెల 26వ తేదీన కృష్ణా జిల్లా మోపిదేవి గుడికి అని వెళ్లాడన్నారు. ఇప్పటి వరకు తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేదన్నారు. దీంతో ఆదివారం వెంకటేశ్వర్లు కుమారుడు గోపీరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వెంకటేశ్వర్లు ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లోగానీ, 9550100645 నంబరుకు గానీ తెలపాలన్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు



అల్లూరు(కర్లపాలెం): ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ నన్నపనేని రాజీవ్ మోహన్ చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఆదివారం బుడేసాహెబ్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో అల్లూరు హెల్త్‌కేర్ మెడికల్స్ కార్యాలయంలో గుంటూరు ఒమెగా హాస్పిటల్స్ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి సాధారణ వ్యాధులతో పాటు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేశారు. ఈ బుడేసాహెబ్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకుడు షేక్ ఫజుల్ రెహ్మాన్ డాక్టర్ ఎంజీ నాగకిషోర్, ఆర్గనైజర్ శ్రీనివాస్, పాస్టర్ శ్యామ్యూల్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

నిజాంపట్నం: ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నిజాంపట్నం మొగదారమ్మ కాలనీకి చెందిన కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు కుటుంబానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు చేయూతనిచ్చాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం బ్రాంచ్ సభ్యులు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుప్పట్లు, వస్త్రాలు అందజేశారు. అదేవిధంగా అమ్మ భగవాన్ సంస్థ ఆధ్వర్యంలో మొదదారయ్య రూ.5 వేలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కే గౌరీశంకర్, సభ్యులు చావలి కోటేశ్వరరావు, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం వాతావరణం.. బాబోయ్



ఆదివారం దట్టమైన పొగ మంచు



ఎండకు చెట్ల నీడకు చేరిన గొర్రెలు, మేకలు

చెరుకుపల్లి: మార్చి నెల 15 రోజులు గడిచినా కూడా వాతావరణంలో విచిత్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత కొద్ది రోజులుగా మండల పరిసర ప్రాంతాల్లో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచే తీవ్రమైన చలిగాలులు, మరలా ఉదయానికల్లా చలిగాలితో పాటు పొగమంచు కమ్మేస్తుంది. ఉదయం 11 గంటల నుంచి తీవ్రమైన ఎండ దంచి కొడుతుంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భానుడు తన ప్రతాపం చూపించటంతో 12 గంటల కల్లా అందరూ ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆదివారం దట్టంగా కమ్మేసిన మంచు కారణంగా వర్షాకాలం తలపించేలా చిరు జల్లులు కురిసిన విధంగా రోడ్లు తడిసిపోయాయి.

వాతవరణంలో మార్పు కారణంగా అనారోగ్యం

మండల పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావటంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు జ్వరాల బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైన అవసరమైతే తప్ప పొగ మంచులో తిరగరాదని, అదే విధంగా మధ్యాహ్న సమయంలో ఎండల్లో తిరగటం, ప్రయాణాలు చేయటం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు. మండలంలో మినుము, పెసర, వరి నూర్పిళ్లు ముమ్మరంగా ప్రారంభం కావటంతో ఉదయం 7 గంటలకు పొలాలకు చేరుకుని పనులు సాగిస్తున్నారు. అయితే 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎండ తీవ్రంగా ఉండటంతో వ్యవసాయ కూలీలు, మూగ జీవాలు ఎండకు హడలెత్తి చెట్ల నీడలకు చేరుకుంటున్నారు. మార్చి నెల సగం గడిచినా డిసెంబర్ నెలలోగా దట్టంగా పొగ మంచు మధ్యాహ్నం నుంచి ఎండల తాకిడికి రోడ్లు జనజీవనం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ఎంపీడీవో ఎం.శోభారాణి

రేపల్లె రూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎం.శోభారాణి కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి చెరువులు నింపుకోవటం, చేతిపంపులకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీపీ పెనుమాల సుశీల, మండల ఉపాధ్యక్షులు రావు నెహ్రూ లక్ష్మి, పీతా సాంబశివరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



కర్లపాలెం: కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పెనుగొండ నుంచి పాదయాత్రగా తిరుమల వెళుతున్న ప్రజ్ఞానందస్వామికి స్థానిక ఆర్యవైశ్యులు స్వాగతం పలికి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. కల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చక స్వాములు శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.